రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



సీతాఫల్‌మండిలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు గురువారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ బీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారపు రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ రాహుల్ వ్యాఖ్యలు హిందువులను అవమాన పరిచే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్‌గౌడ్, ప్రభుగుప్త, రాజేశ్వరి, అంబాల రాజేశ్వర్‌రావు, ఆకుల సంపత్, హర్షకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండిలో బీజేపీ సభ్యత్వ నమోదు



బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న పార్టీ రాష్ట్ర నాయకుడు రవిప్రసాద్‌గౌడ్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ బ్రాహ్మణబస్తీలో గురువారం బీజేపీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. డివిజన్ బీజేపీ నాయకుడు ఎన్ఎస్ అజయ్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కనకట్ల హరి, ఆకుల మహేశ్, లక్ష్మణ్, నరేశ్, విక్రం, సీత, రాధిక పాల్గొన్నారు.

వీల్ నారో ఫ్రేమ్‌ల పంపిణీ



బౌద్ధనగర్: పారిశుద్ధ్య సిబ్బందికి చెత్త తరలింపునకు వీల్ నారో ఫ్రేమ్‌లు సౌకర్యవంతంగా ఉంటాయని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. గురువారం బౌద్ధనగర్‌లోని వార్డు కార్యాలయంలో పారిశుద్ధ్య సిబ్బందికి 10 వీల్ నారో ఫ్రేమ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కంది శైలజ మాట్లాడుతూ వీల్ నారో ఫ్రేమ్‌ల ద్వారా పారిశుద్ధ్య సిబ్బందికి చెత్త తరలింపు సమయాల్లో శ్రమ తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంకటేష్, జవాన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల చిన్నారితో అసభ్య ప్రవర్తన

బంజారాహిల్స్: నాలుగేళ్ల చిన్నారితో ఓ యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వెంకటగిరి ప్రాంతంలో నివసించే పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన సాహెబ్‌సేన్ (21) సమీపంలో నివసించే నాలుగేళ్ల చిన్నారిని తనతో పాటు తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో జూబ్లీహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. చిన్నారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సాహెబ్‌సేన్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సాహెబ్‌సేన్ ఒక హోటల్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు.

లింక్ ఓపెన్ చేసి రూ. 46,500 పోగొట్టుకున్నాడు

ఎస్‌బీఐ పాయింట్స్ పేరుతో మోసం

వెంగళరావునగర్: ఎస్‌బీఐ పాయింట్స్ పేరుతో ఆన్‌లైన్‌లో నగదు కొట్టేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కేరళ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఆలీ రెజాయి స్థానికంగా ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ యూసుఫ్‌గూడలో నివసిస్తున్నాడు. ఈనెల 9వ తేదీన ఎస్‌బీఐ నుంచి రూ. 9451 పాయింట్స్ వచ్చాయని వాటిని క్యాష్ చేసుకోవడానికి లింగ్ ఓపెన్ చేయాలని మెసేజ్ వచ్చింది. వెంటనే ఆలీ ఆ లింక్‌ను ఓపెన్ చేయగా అతని ఖాతాలో నుంచి రూ. 46,500 డెబిట్ అయ్యాయి. దీంతో బాధితుడు సైబరాబాద్ పోలీసులకు తెలియజేసి అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మా భూములను రీసర్వే చేయండి



పంజగుట్ట: పైసా పైసా కూడబెట్టుకొని కొనుక్కున్న స్థలంలో నిర్మాణాలు కూల్చివెయ్యడమే కాకుండా, తమను కబ్జాదారులని అనడం బాధాకరమని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్‌టెక్షన్ ట్రైనింగ్ యూనిట్ (సిట్) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి, అల్లాపూర్‌లో ఉన్న సున్నం చెరువుకు శేరిలింగంపల్లి మండల్‌లో ఉన్న తమ స్థలాలకు లింక్ పెట్టి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటీ ప్రతినిధి, రిటైర్డ్ ఐఏఎస్ చుక్కా కొండయ్య, అధ్యక్షుడు సదానందం, బి.ఎస్.ఎన్.రాజులు మాట్లాడుతూ 1982లో ఉద్యోగస్తులం అందరం కలిసి ఆవుల సాంబశివరావు వద్ద 24 ఎకరాల స్థలం కొనుగోలు చేసి హెచ్ఎండీఏ అనుమతితో లేఔట్ చేసి 236 ప్లాట్లు చేశామని తెలిపారు. కాగా 2013-14లో జలమండలి అధికారి పాత సర్వేని మార్చి కొత్త సర్వే చేసి తమ స్థలాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని ఎఫ్‌టీఎల్ బౌండరీలు మార్చారని తెలిపారు. తాము జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులను ఎన్నోసార్లు కలిసి తమ స్థలాలు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి రావని, రీ సర్వే చెయ్యాలని చెప్పినా పట్టించుకోలేదన్నారు. గత ఆదివారం ఒక్కసారిగా హైడ్రా అధికారులు వచ్చి 10 షెడ్‌లు, రెండు భవనాలు, కొన్ని నిర్మాణాలు కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రీసర్వే చేసి తమకు న్యాయం చెయ్యాలని వారు విజ్ఞప్తి చేశారు.

గణనాథుడి సేవలో...



రవీంద్రనగర్ కాలనీలో..



బేగంపేట సింధికాలనీలో..



పార్సిగుట్ట మండపం వద్ద అన్నదానం

గణనాథుడి సేవలో భక్తజనం తరిస్తున్నారు. వాడవాడలా వీధివీధినా అందంగా రూపుదిద్దుకున్న మండపాల్లో కొలువుదీరిన పార్వతీసుతుడికి భక్తి శ్రద్ధలతో నిత్యపూజలు కొనసాగుతున్నాయి. పలు మండపాల్లో అన్నదాన కార్యక్రమాలు, లడ్డూ వేలంపాటలతో మండపాల వద్ద సందడి వాతావరణం అలుముకుంటోంది. ఇక భక్తులచే విశేష పూజలందుకున్న ఏకదంతుడిని డప్పు వాయిద్యాలు, యువత కేరింతల నడుమ నిమజ్జనానికి తరలిస్తున్నారు.



లాలాపేట, తార్నాక నుంచి నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు



చాణక్య నగర్‌లో..



మాణికేశ్వర్‌నగర్‌లో..



లాలాపేటలో..



లాలాపేటలో అన్నదానం



సనత్‌నగర్ బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో అన్నదానం



తార్నాక చింతల్ బస్తీలో..



బీకేగూడలో అన్నదానం..



సనత్‌నగర్ తులసీనగర్ గణేషుడి పూజలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్



శాంతినగర్‌లోని శివపుత్ర ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో..

రేపు తార్నాకలో 'మూలం సంత'

లాలాపేట: గ్రామభారతి, సిఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న తార్నాకలోని మత్రికృష్ణా ఫంక్షన్ హాల్లో 'మూలం సంత'ను ఏర్పాటు చేస్తున్నారు. ఇది శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల కొనసాగుతుందన్నారు. ఇందులో వ్యవసాయ ఉత్పత్తులు, అనుబంధ కుటీర పరిశ్రమలకు చెందిన ఉత్పత్తులను విక్రయానికి అందుబాటులో ఉంచుతామన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాంగోపాల్‌పేట్: గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మరణించారు. ఈ ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన మేరకు.. గత నెల 31వ తేదీన 35 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి రాణిగంజ్‌లోని రైల్వే ట్రాక్ పక్కన అపస్మారక స్థితిలో పడివుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని 108 ద్వారా గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. మృతదేహాన్ని గుర్తింపు నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

మినిస్టీరియల్ కమిటీ చైర్మన్‌ను కలిసిన బుర్హానుద్దీన్



బంజారాహిల్స్: కాంగ్రెస్ అధిష్ఠానం నియమించిన మినిస్టీరియల్ కమిటీ చైర్మన్ జి. పరమేశ్వరను హైదరాబాద్ ఫిలింనగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ మైనార్టీ నేత సయ్యద్ బుర్హనుద్దీన్ కలిసి అభినందించారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కాములపై విచారణ చేపట్టాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై చర్చించారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావడమే లక్ష్యంగా మైనార్టీలంతా ఇప్పటి నుంచే ఐకమత్యంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా సూచించారు.

పారిశుద్ధ్య పనులు మరింత వేగవంతం



చెత్త సేకరించే తోపుడు బండ్లను కార్మికులకు అందజేస్తున్న డీసీ సుభాష్‌రావు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్యం పనులు మరింత వేగవంతం చేయడానికి తోపుడుబండ్ల వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినామని డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు చెప్పారు. గురువారం సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలు వద్ద కార్పొరేటర్ సామల హేమతో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు తోపుడుబండ్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ఆటో ట్రాలీలు వెళ్లలేని గల్లీల్లోంచి సైతం చెత్త సేకరించడానికి వీటిని వినియోగించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ వెంకటేశ్, పారిశుద్ధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కిలోల్లో.. టమాటా రూ.27, నల్లవంకాయ 40, పొడుగు వంకాయ 45, బెండకాయ 55, పచ్చిమిర్చి 18, బజ్జీ మిర్చి 65, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 45, పందిరి బీర 50, క్యాబేజీ 16, క్యారెట్ 50, దొండ 45, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 90, గోకరకాయ 45, కీర 25, దోసకాయ 19, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 44, ఆలుగడ్డ 39, చామగడ్డ 45, మొరంగడ్డ 65, కందగడ్డ 65, సొరకాయ 23, పొట్లకాయ 13, అరటి కాయ 11, మునగకాయ 5-6, ముల్లంగి 5-6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

రహదారుల మరమ్మతు పనులు వేగవంతం

సికింద్రాబాద్: వినాయక నిమజ్జనోత్సవాల సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రహదారుల మరమ్మతు పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. డివిజన్ పరిధిలో జరుగుతన్న రోడ్డు మరమ్మతు పనులను ఆమె గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిలకలగూడ మైదానంలో ఏర్పాటు చేసిన కృత్రిమ కొలనులో నిమజ్జనం కోసం వచ్చే గణపతి విగ్రహాల ఊరేగింపులకు ఇబ్బందులు లేకుండా ఇంటర్నల్ రహదారుల మరమ్మతులకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు మరమ్మతు పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ హేమ

సామాజిక సేవతోనే సమసమాజ స్థాపన



ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ చైర్‌పర్సన్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సామాజిక సేవతో సమసమాజాన్ని స్థాపించవచ్చన్నారు. దేశ సేవలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. యువతకు స్ఫూర్తిని చ్చేవిధంగా వారి సేవలు ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్ మోటివేటర్ రవితేజ ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ ఆవశ్యకతను విద్యార్థినులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఏడు రోజుల పాటు గ్రామాల్లో వివిధ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్‌తో ప్రకృతికి కలుగుతున్న హాని, వృక్షసంపద ప్రాధాన్యం, ఎయిడ్స్, క్యాన్సర్ వ్యాధులపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, ప్రసన్న, నర్సింహ్మా, మధుకర్‌రావు, సరిత తదితరులు పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో జూనియర్ అథ్లెటిక్స్

ఉస్మానియా యూనివర్సిటీ: హైదరాబాద్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఓయూలో జరగనున్నట్లు డైరెక్టర్ ప్రొ.రాజేష్ కుమార్ గురువారం తెలిపారు. వర్సిటీలో కొత్తగా నిర్మించిన ఓయూ సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌లో ఈ నెల 19, 20 తేదీలలో 14, 16, 18, 20 సంవత్సరాల బాల, బాలికలకు పోటీలు ఉంటాయన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేరెడ్డి, ప్రొ. రాజేష్‌కుమార్ పోటీల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు.

భారత్‌పై విషం చిమ్మడమేంటి?

ముషీరాబాద్: ప్రధాని నరేంద్రమోదీపై అక్కసుతో విదేశాల్లో భారత దేశంపై రాహుల్‌గాంధీ విషం చిమ్ముతున్నారని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. ప్రధాని మోదీ, బీజేపీకి ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకపోతున్నారని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, మైనార్టీలకు రక్షణ లేదని రాహుల్‌గాంధీ తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలో దేశ సురక్షితంగా ఉందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే అభివృద్ధి చేస్తుండటంతో ప్రజాధరణ పెరుగుతూనే ఉందని అన్నారు. గురువారం ముషీరాబాద్‌లోని మున్సిపల్ కాలనీలో కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ సభ్యత్వం తీసుకోవడం అంటే దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావడమేనని అన్నారు.

నిరంజన్‌కు అభినందనలు



నిరంజన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అసోసియేషన్ ప్రతినిధులు..

బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయడం పట్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బ్యాక్‌వర్డ్ క్లాస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేస్తూ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. నిరంజన్‌ను కలిసిన వారిలో ఓయూ జేఏసీ నాయకులు బాలలక్ష్మీ, తిరుమలగిరి సురేందర్, అసోసియేషన్ అధ్యక్షు లు మహేశ్వర్‌గౌడ్, ముఖ్య కార్యదర్శి కిషోర్‌బాబు ఉన్నారు.

14, 15 తేదీల్లో జెవీవీ రాష్ట్ర మహాసభలు

పంజగుట్ట: జన విజ్ఞాన వేదిక తెలంగాణ 5వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 14, 15వ తేదీల్లో మేడ్చల్ జిల్లా, కాప్రా, అణుపురం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాసభల కరపత్రాన్ని కోశాధికారి రావుల వరప్రసాద్, కార్యదర్శి రాజాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1988లో ప్రారంభమైన జెవివి దేశం పురోగతికి సైన్స్ ఎంతో ఉపయోగపడుతుందని ప్రచారం చేయడంతోపాటు మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశామని తెలిపారు. 14వ తేదీన విద్యావిధానం, వక్రీకరణలు, ఎలా సరిచెయ్యాలి అనే అంశంపై ప్రముఖ సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ హరగోపాల్ ప్రసంగిస్తారని, ప్రగతికి తొలిమెట్టు ప్రశ్న అనే అంశంపై సీనియర్ సంపాదకులు కె. శ్రీనివాస్ ప్రసంగిస్తారని తెలిపారు. ప్రజారోగ్యం ప్రభుత్వాల బాధ్యత అనే అంశంపై ప్రొఫెసర్ పురేంద్రప్రసాద్, పర్యావరణం అభివృద్ధి అనే అంశంపై డాక్టర్ లుబ్నా సార్వత్‌లు ప్రసంగిస్తారని తెలిపారు. 15వ తేదీన ముగింపు రోజు ప్రజా సైన్స్ ఉద్యమ దశ - దిశ అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌రావు ప్రసంగిస్తారని తెలిపారు.